వీరభద్రస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

కురవి, అక్టోబర్ 20: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

వ్యాపారులకు నోటీసులు

మండల కేంద్రంలోని వీరభద్రస్వా మి గుడి సెంటర్‌లో రహదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న చికె న్ సెంటర్లు, టిఫిన్ హోటల్స్, బొమ్మ లు, కొబ్బరికాయల షాప్‌లు, ఇతర వ్యాపార సముదాయల యజమానులకు ఆదివారం సాయంత్రం నోటీసు లు అందజేశారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర నేరాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నోటీసులు జారీ చేసినట్లు ఎస్సై గంధ్రాతి సతీశ్ తెలిపారు. నోటీసులు, నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

21 నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 20: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల 21 నుంచి 25 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని, అనంతరం రోడ్డులోని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్నరెడ్డి ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం కళాశాల ఎంపికకు టీఎస్‌పీడబ్ల్యూ కోడ్ ద్వారా ఎంపిక చేసుకోవాలని, నవంబర్ 5 వరకు ఫార్మసీ ప్రవేశాలు కొనసాగుతాయన్నారు.

తాటి చెట్టు నరికిన వారిపై చర్య తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

నర్సింహులపేట, అక్టోబర్ 20: ఎక్సైజ్‌శాఖ అనుమతులు లేకుండా తాటి చెట్టును తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గీత కార్మిక సంఘం జిల్లా నాయకుడు గునిగంటి మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం నర్సింహులపేటలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్లుగా కల్లు తీస్తున్న చెట్టును తొలగించడం దారుణమని, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డొనికెన రామన్న, కృష్ణ, వెంకన్న, ఏకాంబ్రం, రమేశ్, శ్రీను, వీరన్న, మల్లయ్య, నగేశ్ ఉన్నారు.

కనులపండువగా తెప్పోత్సవం

గార్ల, అక్టోబర్ 20: మండలంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం ఆదివారం ఆలయం ఎదుట కోనేరులో అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ కనుల పండువగా నిర్వహించారు. స్వామి కల్యాణం అనంతరం మూడో రోజు తెప్పోత్సవం జరిపించడం ఆనవాయితీ. మం డలమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు పులి గోపాల్‌రెడ్డి, ప్రమీలదేవి, రమేశ్‌బాబు, కస్నానాయక్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, రావూరి వెంకటరామయ్య, నరేందర్ శ్రీనివాస్‌గుప్త పాల్గొన్నారు.

ఆకేరు ఆనకట్టకు మరమ్మతులేవీ..?

- కుడి కాల్వకు గండి.. వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

ఆకేరు కుడి కాల్వకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

చిన్నగూడూరు, అక్టోబర్ 20: మండల కేంద్రం శివారులోని ఆకేరు ఆనకట్ట గతనెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్నది. ఆనకట్టకు రెండు వైపులా కుడి, ఎడమ కాల్వలుండగా కుడి కాల్వకు భారీ గండి పడి నీరు వృథాగా పోతున్నది. ఈ ప్రాంత అభివృద్ధి కోసం 1964 లో అప్పటి మంత్రి నూకల రాంచంద్రారెడ్డి చిన్నగూడూరు-ఉగ్గంపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ఆకేరు వాగుపై ఆనకట్ట నిర్మించారు. దీనికి కుడి, ఎడమ కాల్వలను ఏర్పాటు చేశారు. ఎడమ కాల్వ ద్వారా చిన్నగూడూరు, జయ్యారం, మన్నెగూడెం నుంచి మరిపెడ మండల ఎడ్జర్ల వరకు, కుడి కాల్వ ద్వారా ఉగ్గంపల్లి, విస్సంపల్లి, మరిపెడ మండలంలోని బీచురాజుపల్లి, పురుషోత్తమాయగూడెం వరకు ఉన్న గ్రామాల్లోని చెరువులకు నీరు అందించే లక్ష్యంతో ఆనకట్ట నిర్మించారు. ఆనకట్ట నిర్మాణంతో ఈ ప్రాంతం కొన్నేండ్ల పాటు నిత్యం పాడిపంటలతో అలరారింది. ప్రస్తుతం ఆనకట్ట మధ్యలో కోతకు గురైంది. కుడి కాల్వకు భారీ గండి పడి నీరు వృథాగా పోతున్నది. ఇప్పటి వరకు పాలకులు ఆనకట్టవైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆకేరు జీవనదిలా ఒక్కసారి నిండితే ఈ ప్రాంతంలో రెండు పంటలకు ఢోకా లేకపోయేది. గత యాసంగి సీజన్‌లో ఆకేరులో చుక్క నీరులేక వేసిన పంటలు ఎండిపోయి తీవ్రనష్టం వాటిల్లిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం కాలమై కరువైన చందంగా అధిక వర్షాలు పడినప్పటికీ ఆకేరు ఆనకట్టలో నీరు నిలిచే పరిస్థితి లేదు. వచ్చిన నీరు వచ్చినట్లే వెళ్లిపోతుండడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టి ఆనకట్ట, కుడికాల్వకు పడిన డ్యామేజీని పూడ్చి రైతన్నలకు సాగు నీటి కష్టాలు లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వరద ఉధృతికి మధ్యలో తెగిపోయిన చిన్నగూడూరు ఆనకట్ట

యాకూబ్‌రెడ్డికి అవార్డు అందించి సన్మానిస్తున్న సేవాట్రస్టు ప్రతినిధులు, సభ్యులు

యాకూబ్‌రెడ్డికి 'శ్రీగురు' పురస్కారం

కేసముద్రం, అక్టోబర్ 20: మండలానికి చెందిన పోలెపల్లి యాకూబ్‌రెడ్డికి మహాశక్తి సేవాట్రస్టు ఉప్పల్ వారు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీగురు పురస్కారం అందించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా కేరళా తాంత్రి విష్ణు నారాయణపొట్టి, ఓలం చంద్రశేఖర్, బోగోజు నాగేశ్వరాచారి, తరాల సంపత్, వేముల వెంకటేశ్వర్‌రెడ్డి, గాంధీ వెంకట్‌రెడ్డి, కొత్తపల్లి శేఖర్, చితం నాగేశ్వరరావు ఉన్నారు.

నైతిక విలువలను పెంపొందించాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 20: నేటి ఆధునిక సమాజంలో నైతిక విలువలను పెంపొందించాలని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఖలీద్ ముబాషిర్ జాఫర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఏఎల్ ఫంక్షన్ హాల్‌లో ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహీ వసల్లం జీవిత చరిత్ర బోధనలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు, అనాథలు, వితంతువులు, మహిళపై గౌరవం ప్రదర్శించేలా యువత ప్రవర్తన ఉండాలన్నారు. కార్యక్రమంలో అమీర్ ముఖామి, ఎండీ ఇక్బాల్, నాజీమె, సత్తార్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

'రైతు భరోసా' ఎగ్గొట్టాలని చూస్తున్న కాంగ్రెస్

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 20: రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా ఎగ్గొట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేసేందుకు అనేక కొర్రీలు పెడుతోందన్నారు. కేసీఆర్ అందిస్తున్న ఎకరాలకు రూ.10వేలు కాకుండా రూ.15వేలు ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. నిరుపేదలకు మాయ మాటలు చెప్పి ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన పేరుతో నిరు పేదల ఇండ్లను సీఎం రేవంత్‌రెడ్డి కూల్చుతున్నాడని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బులు అప్పజెప్పటాకి హైడ్రాను తీసుకొచ్చిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజల సంక్షేమం కోసం మంచి పరిపాలన అందించాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ప్రతి నిరుపేదకు న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం చూడాలన్నారు. రైతు రుణమాఫీ కేవలం 30 శాతం మందికి మాత్రమే అయిందని, రైతులకు నష్టం జరగకుండా రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ ఫరీద్, నాయిని రంజిత్‌కుమార్ తేళ్ల శ్రీనివాస్, లునావత్ అశోక్‌నాయక్, రవికుమార్, జీ వెంకన్న, మహబూబ్‌పాషా, షేక్ ఖాదర్‌బాబా, దామునాయక్, నవీన్‌నాయక్, కత్తుల ఎలేందర్, రామచంద్రు నాయక్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రభుత్వాలు విఫలం

గార్ల, అక్టోబర్ 20: ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పినిరెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన పార్టీ పదో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పేదల సమస్యలను పట్టించుకోకుండా విస్మరించిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, చింత ఎల్లయ్య, సత్యవతి పాల్గొన్నారు.

జీవో 29ను రద్దు చేయాలి

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ

తొర్రూరు, అక్టోబర్ 20: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29ను వెంటనే రద్దు చేయాలని గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ అభ్యర్థులకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు లాటిచార్జ్ చేస్తూ అభ్యర్థులపై కర్కశంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. జీవో 29ను రద్దు చేసి, గ్రూప్-1 మెయిన్స్‌ను రీ-షెడ్యూల్ చేయాలని, ప్రిలిమ్స్ ఫలితాల్లో రూల్‌ఆఫ్ రిజర్వేషన్ ప్రకటించాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలి : ఏఈ పాండు

నర్సింహులపేట, అక్టోబర్ 20: విద్యుత్ సమస్య పరిష్కారం కోసం నిర్వహించనున్న విద్యుత్ వినియోగదారుల సదస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్ కో ఏఈ ఆర్ పాండు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సోమవారం చిన్న గూడూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో లోకల్‌కోర్టు ఉంటుందన్నారు. నర్సింహులపేట, మరిపెడ, చిన్నగూడూరు మండలాల్లో విద్యుత్ సమస్యలుంటే రాత పూర్వకరంగా ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్వీకరిస్తారని, వినియోగదారులు వినియోగించుకోవాలన్నారు.

కుమ్రంభీం ఆశయాలను సాధిస్తాం

కుమ్రంభీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తగూడ/ గూడూరు, అక్టోబర్ 20: కుమ్రంభీం ఆశయాలను సాధిస్తామని ఆదివాసీ గిరిజన నాయకులు అన్నారు. ఆదివారం కుమ్రంభీం 84వ వర్ధంతి సందర్భంగా గూడూరు, కొత్తగూడ మండల కేంద్రాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఈసం సుధాకర్, పొడుగు కృష్ణమూర్తి, దారం స్వామి, బూర్క యాదగిరి, మల్లేల రాము, సందీప్, సారయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీచర్ల పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 20: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డికి ఉపాధ్యాయులు నారాయణ, వెంకన్న వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఐదు డీఏలు, పీఆర్సీ అమలు, జీవో 317 బాధితులకు స్థానికత వర్తింపు, మోడల్ స్కూల్, గురుకులంలో సమయపాలనలో మార్పు గురించి ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లి, వెంటనే సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని కోరారు.

ట్రాలీ ఆటో బోల్తా పడి ఒకరి మృతి

ఆరుగురికి తీవ్ర గాయాలు

కురవి, అక్టోబర్ 20: అన్న అస్థికలు నదిలో కలిపేందుకు వెళ్తూ ఆటో బోల్తా పడి తమ్ముడు మృతి చెందిన ఘటన మండల కేంద్ర శివారు లింగ్యాతండా వద్ద 365 జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. కురవి మండలం సూధనపల్లి గ్రామానికి చెందిన నీలం నర్సయ్య(60), అన్న రామకోటయ్య 15 రోజుల క్రితం మృతిచెందాడు. మృతుడి కుమారులు, కుటుంబ సభ్యులతో కలిసి అన్న అస్థికలు కలిపేందుకు టాటా ట్రాలీ(గూడ్సు)లో బయల్దేరారు. లింగ్యాతండా గ్రామం మూడు గుడిసెలతండా దాటగానే వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాలీ ఆటోలో వెనుకాల కూర్చున్న నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఆరుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మానుకోట ఏరియా దవాఖానకు తరలించారు. ఎస్సై గంధ్రాతి సతీశ్ సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. 15 రోజుల వ్యవధిలోనే అన్నదమ్ములు మృతి చెందడంతో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రాజడి

బిల్లుల భారం తగ్గేదెలా?

క్రెడిట్ కార్డ్ బకాయిల చెల్లింపులకు దారులివీ..



క్రెడిట్ కార్డుల్ని సవ్యంగా వినియోగిస్తే వాటితో ఎన్నో లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితుల నిర్వహణలో వీటి పాత్ర ఎంతో ప్రభావవంతం. కానీ దురదృష్టవశాత్తూ చాలామంది ఈ క్రెడిట్ కార్డుల వాడకంతో మితిమీరిన ఖర్చుల వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే బిల్లులను చెల్లించలేని దుస్థితికి చేరుకుంటున్నారు. అయితే భారమైన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో..

ఈఎంఐల్లోకి మార్చడం

చాలా క్రెడిట్ కార్డు సంస్థలు బకాయిలను ఈఎంఐల్లోకి మార్చుకునే సౌకర్యం వినియోగదారులకు ఇస్తున్నాయి. నిజానికి మెజారిటీ బ్యాంకులు ఈ సదుపాయాన్ని ఉచితంగానే కార్డుదారులకు అందిస్తున్నాయి. దీనివల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో నగదును సమకూర్చుకునే భారం తప్పుతుంది. అయితే క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐల్లోకి మార్చుకునే ముందు కనిపించని చార్జీలు ఏమైనా ఉన్నాయా?, ప్రాసెసింగ్ ఫీజులుంటాయా? అన్నది జాగ్రత్తగా చూసుకోవడం మంచిది.

బిల్లింగ్ విధానంపై అవగాహన

క్రెడిట్ కార్డు వినియోగదారులు తప్పక తమ క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ సైకిల్‌ను తెలుసుకోవాలి. బ్యాంకులు క్రెడిట్-ఫ్రీ పీరియడ్‌ను కల్పిస్తాయి. ఇందులో బకాయిల చెల్లింపునకు 30 రోజుల స్టేట్‌మెంట్ సైకిల్, దానిపై 15 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటాయి. ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ ఏ తేదీన మొదలవుతుందో చూసుకోవాలి. ఆ తేదీ తర్వాత కొంటే మనకు పేమెంట్‌కు ఎక్కువ సమయం ఉంటుంది. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు బిల్లు డ్యూ డేట్ ఆగస్టు 4న ఉన్నది. ఆ బిల్లు స్టేట్‌మెంట్ జూలై 18న వచ్చింది. అయితే జూలై 19న మీరు మీ క్రెడిట్ కార్డు ద్వారా ఓ వస్తువును కొన్నారు. అప్పుడు అది తర్వాతి బిల్లు స్టేట్‌మెంట్‌లో ఉంటుంది. దాన్నిబట్టి సెప్టెంబర్ 4వరకు మీరు దాని చెల్లింపునకు వ్యవధి ఉంటుందన్నమాట. ఒకవేళ జూలై 17న కొంటే ఆగస్టు 4కల్లా చెల్లించాల్సిందే. రెండ్రోజులు ఆగి కొనడం వల్ల ఇంత లాభం ఉంటుంది. సమయం ఎక్కువగా ఉండటం వల్ల నగదు సర్దుబాటుకు వీలుంటుంది.

పర్సనల్ లోన్

క్రెడిట్ కార్డు బకాయిలపై పడే వడ్డీ రేటు కన్నా.. వ్యక్తిగత రుణాలపై పడే వడ్డీ రేటు తక్కువ. కాబట్టి ఎక్కువగా ఉన్న క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించేందుకు పర్సనల్ లోన్ల సహాయం తీసుకోండి. మీ క్రెడిట్ స్కోర్ బాగుంటే వడ్డీ రేటు ఇంకా తగ్గుతుంది. అలాగే మినిమం కంటే ఎక్కువగా క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లిస్తే మంచిది. అధిక వడ్డీ బకాయిలను ముందుగా చెల్లించాలి. తక్కువ మొత్తాలను తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతకన్నా ముందు అనవసరపు కొనుగోళ్లను తగ్గిస్తే బిల్లుల భారం తగ్గుతుంది.

రిటైర్మెంట్ ప్లానింగ్ ఇలా..

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మరువద్దు

రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలాచాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్లైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతరం జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

పొదుపుపై ధరల దెబ్బ

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. అందువల్ల కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

ఇదీ సంగతి..

రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000 లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని.

అధిక నిధి ఎలా?

ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

ఈక్విటీల్లో పెట్టుబడులు

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరిఅని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్-టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్-టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్లైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

పెట్టుబడుల వర్గీకరణ

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, నగదు-బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒక ట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లు

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్పకాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

గుర్తుంచుకోండి

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం ఎఫ్‌డీ, ప్రభుత్వ పథకాలు బెటర్. పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. ఐటీ మినహాయింపులూ ఉంటాయి.

పీవోఎంఐఎస్ భళా

నెలనెలా ఆదాయాన్ని ఆశించేవారు, సురక్షిత పెట్టుబడులపట్ల ఆసక్తిగలవారు పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం (పీవోఎంఐఎస్)ను పరిశీలించవచ్చు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం ఆకర్షణీయ వడ్డీరేటును అందిస్తున్నది. అక్టోబర్-డిసెంబర్‌కు 7.40 శాతం వడ్డీరేటు వస్తున్నది. ఇతర చిన్నమొత్తాల పొదుపు పథకాల వడ్డీరేట్ల మాదిరిగానే ఈ పీవోఎంఐ స్కీం వడ్డీరేటును కూడా మూడు నెలలకోసారి సవరిస్తారు. ఇక ఈ పథకం కచ్చితమైన రాబడులను మదుపరులకు అందిస్తుంది. డెట్ ఇన్వెస్ట్‌మెంట్ల కంటే అవి ఉత్తమంగానే ఉంటాయి. స్కీం మెచ్యూరిటీ కాలవ్యవధి ఐదేండ్లు. గరిష్ఠంగా రూ.9 లక్షలు పెట్టుబడిగా పెట్టవచ్చు. ఇద్దరు లేదా ముగ్గురితో కలిసి కూడా స్కీంలో చేరవచ్చు. అప్పుడు పెట్టుబడి పరిమితి రూ